


పెద్దకథ

# ప్రణయజ్వాల

— శ్రీదేవీ మురళీధర్

[గత సంచిక తరువాయి]

"పనికొచ్చేది అదొక్కటే మరి! డబ్బా, మజాకా?"

"మీరేదో మర్యాదస్తులనుకున్నాం. నాన్నాలే. ఈ సంబంధం మాకు అక్కర్లేదు" విసురుగా లేచాడు కుమార్.

"కూర్చోండి మిస్టర్ రామ్‌కుమార్. అసలు తతంగం మొదలవుతోంటే వెళ్తానని లేస్తారేమిటి?" అతణ్ణి బలవంతంగా కూచోబెడుతూ అన్నాడు నీరాకర్.

"అన్నయ్యా! మనకేనా సిగ్గూ అభిమానం లేనిది. సంబంధం వద్దంటూన్న వాళ్ళను బలవంతంగా కూర్చోబెడతావేమిటి? వెళ్ళనివ్వు. అతనికే కాదు, నాకూ ఈ సంబంధం యిష్టం లేదు" బలవంతంగా పొరలి వస్తోన్న దుఃఖాన్ని అపుకుంటూ అన్నది శాలిని.

"అదుగో. మా చెల్లాయిని చూశైనా బుద్ధి తెచ్చుకోండి."

"అమ్మా పద వెళదాం. మంచీ మన్ననా తెలీని మనుషులతో మనకేమిటి?" నీరాకర్ చేతులు తోసేస్తూ అన్నాడు కుమార్.

వికటంగా నవ్వాడు నీరాకర్.

"మిస్టర్ రాంకుమార్! నువ్వు చేసుకుంటానని కాళ్ళావేళ్ళా పడ్డా నా చెల్లెల్ని నీకిచ్చి చెయ్యను. కానీ కట్నం పుచ్చుకోకుండా పెళ్ళాడతానన్నా నీతో నా చెల్లెలి జీవితం ముడిపెట్టను. ఎందుకో తెలుసా? నాకు నువ్వెవరో తెలుసు గనుక" కటువుగా ఒక్కొక్క అక్షరం వత్తి పలుకుతూ చెప్పాడు నీరాకర్.

"నాన్సెన్స్! నాకు యిదివరకు నువ్వెవరో ఏమిటో తెలీదు. ఈ మధ్యే నీతో పరిచయమైంది. అదీ నీకు నువ్వుగా ఈ ప్రతిపాదనతో వచ్చినప్పుడు." విసుగ్గా అరిచాడు కుమార్.

"నీ భార్య ప్రసవ సమయంలో చచ్చిపోయింది కదూ" సూటిగా చూస్తూ అడిగాడు నీరాకర్.

"అవును."

"ప్రసవించలేక కత్తిపీటతో పీక నరుక్కుని చనిపోయింది. అవునా?"

"షటప్. చనిపోయిన నా భార్య గురించి మాట్లాడే హక్కు నీకు లేదు" పిచ్చెక్కినట్లు అరిచాడు కుమార్.

"అన్నయ్యా....ఏమిటి నువ్వు మాట్లాడుతున్నది? అసలు నువ్వీ లోకంలో వున్నావా? రత్నకుమారిగారూ.... అందరినీ పంపించెయ్యండి. మా అన్నయ్య చాలా ఆవేశంలో వున్నాడు....ప్లీజ్ అంతా వెళ్ళండి" కన్నీళ్ళతో అర్థించింది శాలిని.

"నీ భార్య చనిపోలేదు రాంకుమార్, చంపబడింది. ఘోరంగా హత్య చెయ్యబడింది. మీ కుటుంబ సభ్యుల కుటిలత్వానికీ, మీ ధనాశకూ బలైంది."

"ఏమిటయ్యా వాగుతున్నావ్? అంత దుర్మార్గులం అయితే నీ చెల్లెల్ని ఎందుకు అంటగట్టాలని ఆరాటపడ్డావ్?" కుమార్ తండ్రి నీరాకర్ని నిలదీశాడు.

"తగిన సాక్ష్యధారాలతో మిమ్మల్ని అరెస్టు చేయించటానికి" నీరాకర్ స్నేహితుల్లో ఫోటోలు తీసిన వాళ్ళిద్దరూ నవ్వారు.

"కట్నం పుచ్చుకోవటం నేరం కదండీ. అందుకేగా మీ అబ్బాయికి అంత లావు కోప. మొచ్చింది మేము ఫోటోలు తీయగానే" అన్నారు.

"రామ్‌కుమార్: నువ్వు కేవలం విధివశాన నా వ్యూహంలో చిక్కుకున్నావు. అవిటి పిల్లనూ, అవయవం లోపం వున్న పిల్లనూ చేసుకుంటే, నీకు కావలసిన కట్నమూ గుంజవచ్చు. వాళ్ళు నీ పూర్వాపరాలు విచారించకుండా, నీ అందచందాల్ని చూచి మూర్ఛపోయి నీకు తమ పిల్లనిచ్చి చేస్తారని అభిప్రాయపడ్డావు. కాని ఏం చేస్తాం? అనుకోనిది జరగడమే జీవితం!"

అకస్మాత్తుగా తిరగబడబోయిన రామ్‌కుమార్నీ, అతడి పెద్దల్నీ సి. బి. ఐ. ఆఫీసర్లు బలవంతంగా బయటికి లాక్కుపోయారు.

రావు నీరాకర్ దగ్గరకు వచ్చి "నీరాకర్‌గారూ! నిజంగా ఆ కుర్రాడు అలాంటివాడంటారా?" అని అడిగాడు. విరక్తిగా నవ్వాడు నీరాకర్.... "అతడి గత చరిత్ర తాలూకు ఫైలు తయారు చేయించాను. చూడండి." అంటూ ఒక ఫైలు అందించాడు. గబగబా పేజీలు తిరగేశాడు రావు.

"మైగాడ్! పెళ్ళయిన ఏడాదిలోపలే భార్యని దారుణంగా చంపిన కిరాతకులా వీళ్ళు?"

శాలిని ఒళ్ళు ఝల్లుమంది. "అన్నయ్యా! నీకెందుకు యితడిపై అనుమానం కలిగింది?" అనడిగింది.

"ఇతడూ, ఇతడి కుటుంబమూ నాకు మర్చిపోదామన్నా మరపుకు రారు. మూడేళ్ళ నుండీ రగులుతోన్న మంట యిప్పుడిప్పుడే చల్లారుతోంది." ఎటో చూస్తూ చెబుతున్న అన్నవంక అదిరిపడి చూసింది శాలిని.

"ఏమిటన్నయ్యా నువ్వంటున్నది? వీళ్ళు.... వీళ్ళు....అంజలి...." చెల్లెలి కళ్ళల్లోకి విజయగర్వంతో చూశాడు నీరాకర్. "కరెక్ట్. రామ్‌కుమార్ ఎవరనుకున్నావ్? అగ్ని సాక్షిగా అంజలిని చేపట్టి తరువాత తన ధనాశకు బలిచేసిన మనుడు!" ఉలిక్కిపడింది శాలిని—"నీకెలా తెలిసింది ఇదంతా?"

"అంజలి చంపబడిన తరువాత వీళ్ళ గురించి క్రమం తప్పకుండా వాకబుచేయిస్తూనే వచ్చాను. ఈమధ్యే ట్రాన్స్‌ఫరై వచ్చారు ఈవూరు. తమ గుట్టు ఎవరికి తెలుస్తుందిలే, అంజలి పోయి సంవత్సరాలు గడుస్తున్నాయని, నిర్లక్ష్యంగా వున్నారు. పైగా నీవంటి అమ్మాయినెవర్నయినా చేసుకుంటే రెండోపెళ్ళివాడైనా అభ్యంతరంపెట్టరనీ, బాగానే కట్నకానుకలు ముట్టచెబుతారనీ దురాశ. అదే వాళ్ళని నా వలలోకి లాగింది. నా మనసు యిప్పటికి స్థిమితపడిందమ్మా! అల్లకల్లోలంగా వుండే నా అంతరంగం ప్రశాంతమైంది!"

అంతా వింటోన్న రత్నకుమారి నెమ్మదిగా అన్నది—"మీరు చాలా పొరపాటు చేశారు నీరాకర్ గారూ! చెల్లెలి జీవితాన్ని మీ పగ సాధింపు చర్యలో పావుగా వాడారు."

కొత్త విషయం స్ఫురించినట్లు బాధగా చెల్లెలి వంక చూచాడు నీరాకర్.

"లేదు రత్నకుమారి గారూ! అంజలి నా స్నేహితురాలు. తన ఆత్మ ఎంత క్షోభననుభవించిందో. తను ఏ లోకాల్లోవున్నా ఆ నీచులకు పడ్డ శిక్షకు సంతోషిస్తుంది. ఆమె ఆత్మకు శాంతి చేకూర్చటం... మా కర్తవ్యం!" అన్న వంక ఆప్యాయంగా చూస్తూ అన్నది శాలిని.

ఫైలుమూసి రావు లేస్తూ అన్నాడు" బాగా చెప్పారు! ఇటువంటి క్రూక్స్‌కి తగినశిక్ష పడాలంటే మీ వంటి కొందరు ముందుకు రావాలి. 'మా కెందుకంటే' 'మా కెందుకని' సొంత తల్లిదండ్రులే చేతులు దులుపుకొనే ఈ అనైక్యపు రోజుల్లో మీ వంటి అన్నా చెల్లెళ్ళు అరుదు. అరుదేమిటి, దాదాపు లేరనే చెప్పాలి! ఎసీవే మేము వెళ్లొస్తాం" అంటూ వీడ్కోలు చెప్పి బయటికి నడిచారు.

చెల్లెలి తలనిమురుతూ అన్నాడు నీరాకర్.... "శాలినీ, క్షమించమ్మా....నీ మనస్సును గాయపరచాను" గుమ్మానికీ, గదికీ కట్టిన తోరణాలు వెక్కిరించినట్లనిపించింది నీరాకర్‌కి.

"లేదన్నయ్యా! వాళ్ళు కట్నం అడిగారంటేనే నా భావాలు అతడిపట్ల వ్యతిరేకంగా మారాయి. నీ తృప్తికోసం చేసుకుంటానన్నాను. ఎవరైనా... నా లాంటి మనిషినే వెదుకు అన్నయ్యా! నాకు నా లోపాల్ని పంచుకునే వ్యక్తి కావాలి, గుర్తుచేసి, ఎత్తిచూపే మనిషి వద్దు. నాలాంటి మనిషినే వెదుకు" అన్న ఒడిలో తలదాచుకుని బావురుమంది శాలిని.

"అలాగే లేమ్మా. ఊరుకో" ఓదార్పుగా ఆమె తలనిమురుతూ ఉండిపోయాడు నీరాకర్. అతడి ముఖంలో మునుపటిలా రాగద్వేషాలకు అతీతమైన చిరునవ్వు....నిశ్చలసాగరం వంటి ప్రశాంతత.

గోడమీద మాతృమూర్తి సాన్నిధ్యంలో వెలిగించిన దీపం నీరాకర్ హృదయంలో అంజలిపట్ల నిరంతరం వెలిగే ప్రణయజ్యోతిలా దేదీప్యమానంగా భాసిస్తోంది. □

## చిట్కాలు

★ వేసవి కాలంలో పిల్లలు ఎండలో ఆడుకోవడం సహజం. వారికి ఎండు ఖర్జూరపు కాయలు నీటిలో నానబెట్టి పడగట్టిన పీరు ఇస్తే వంటికిచలవ, ఆరోగ్యానికి మంచిది.

★ వేసవికాలంలో ఓ గ్లాస్ మజ్జిగలో ఓ నిమ్మకాయ ముక్క పిండుకొని కాస్త ఉప్పు వేసుకొని ప్రొద్దున్నే (పరగడుపున) త్రాగితే ఆరోగ్యానికి మంచిది.

★ వేసవిలో వేడివల్ల కొందరికి ముక్కులో నుండి రక్తం కారుతుంది. అలాంటప్పుడు నిమ్మకాయ ముక్కను మాడుకు (తలపై) రుద్ది, చల్లని గుడ్డను నుదుటిపై కాసేపు వేసుకుంటే రక్తం కారడం తగ్గిపోతుంది.

★ స్నానం చేసే ముందు నీటిలో నిమ్మ రసం పిండుకొని స్నానంచేస్తే దురదలు తగ్గిపోతాయి.

★ వేసవిలో కనుగుడ్లు తెల్లగా, చక్కగా, చల్లగా ఉండాలంటే పండిన దోసకాయ గుజ్జును కంటి రెప్పలకు రాసుకుంటే కళ్ళకు చల్లదనం కలుగుతుంది. కళ్ళు ఎర్రబడటం వుండదు.

★ స్నానంచేసే ముందు నిమ్మ రసాన్ని తలకు బాగా పట్టించి ఓ గంట తర్వాత స్నానం చేస్తే చల్లదనం కలగడమేకాక, చుండ్రు, పేలు పోతాయి.

★ వేసవికాలంలో బయట తిరిగివచ్చిన వెంటనే అతి చల్లని నీటిలో పాదాలను ఓ అయిదు నిముషాలుంచండి. ఇది హి పాదాల శ్రమను, శరీర శ్రమను పోగొడుతుంది.

—ఎస్. విజయలక్ష్మి